ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

ఎదులాపురం, జూన్ 7 : పాఠశాలలు పునః ప్రారంభం కాకముందే ఆదిలాబాద్ జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎర్రజీ హరీశ్, మడావి గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విచ్చవిడిగా ఫీజులు పెంచారని వీటి నియంత్రణ కోసం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అందుబాటులో 5,54,335 పత్తి విత్తనాల బ్యాగులు

ఎదులాపురం, జూన్ 7 : ఆదిలాబాద్ జిల్లాలో వివిధ మండలాల్లోని 345 విత్తనాల షాపుల్లో 5,54,335 పత్తి విత్తనాల బ్యాగులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రైతులు విత్తన లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. విత్తనాల కొనుగోలులో ఏదైన సమస్యలు ఎదురైన, ఎంపికలో సలహాలు సూచనల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 8074812429, 9392779149ను సంప్రదించాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నార్నూర్, జూన్ 7 : గాదిగూడలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని కోరంలేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ఆడా చంద్రకళ తెలిపారు. త్వరలోనే తదుపరి తేదీని నిర్ణయించి సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, ఎంఈవో రాపెల్లి ఆశన్న, ఈజీఎస్ ఏపీవో పవార్ నితిన్, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, సంజీవ్, ఐకేపీ ఏపీఎం మాధవి పాల్గొన్నారు.

భారీ వర్షం కురిశాకే విత్తనాలు విత్తుకోవాలి

తాంసి, జూన్ 7 : మండలంలోని రైతులు భారీ వర్షం కురిసిన తర్వాతే పంట చేన్లలో విత్తనాలు విత్తుకోవాలని మండల వ్యవసాయాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం బండల్ నాగపూర్‌తో పాటు పలు రైతు వేదికలో రైతులకు విత్తనాల సేకరణపై అవగాహన కల్పించారు. 60 మిల్లీ మీటర్ల నుంచి 80 మిల్లీ మీటర్ల వర్షం కురిస్తే విత్తుకోవడానికి అనుకూలమని, లేనట్లయితే భూమిలో తేమ శాతం తగ్గి విత్తనాలు మొలకెత్తకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

భైంసా, జూన్ 7 : పట్టణంలోని కాలనీలో గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, హారతి నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు రమేశ్ మాశెట్టి వార్, శంకర్ బచ్చువార్, శ్రీశైలం, శైలేశ్ మాశెట్టి వార్ పాల్గొన్నారు.

9న స్విమింగ్ పోటీలు

ఎదులాపురం, జూన్ 7 : ఆదిలాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకుడు కొమ్ము కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5-8, 9-12, 13-15, 16-18 సంవత్సరాల పిల్లలకు వేర్వేరుగా విత్ అవుట్ ట్యూబ్‌తో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

12న మండల సర్వసభ్య సమావేశం

జైనథ్, జూన్ 7 : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, గ్రామాల ప్రత్యేకాధికారులు హాజరుకా వాలని కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

నేరడిగొండ, జూన్ 7 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎమ్మార్సీలో శుక్రవారం నోట్‌బుక్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో అన్‌రెడ్డి భూమారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జూన్ 7: మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంఈవో నారాయణ శుక్రవారం ఉపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాత్లే గంగారాం, ఉపాధ్యాయులు పవార్ మధన్, శ్యాంసుందర్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది భగవాన్, యోగేశ్, తదితరులు పాల్గొన్నారు.

9న ఉద్యమకారుల సమావేశం

భైంసా, జూన్ 7 : లోకేశ్వరంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9వ తేదీన తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డా. ముష్కం రామకృష్ణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఉదయం 8 గంటలకు ఉంటున్నందున ఉద్యమకారులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం,జూన్ 7 : ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో గల విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజినీరింగ్ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యానగర్, భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమారోడ్, మోచిగల్లీ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మండలంలోని భుక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెరకాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, చిల్కురిలక్ష్మినగర్, జైజవాన్ నగర్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్, రైల్వే స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. సీసీఐ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బాడ్కమోహల్ల, బ్రహ్మణ్‌వాడ, పంజాషా పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోథ్, జూన్ 7 : బోథ్- కిన్వాట్ అంతర్రాష్ట్ర రహదారిపై కౌట(బీ) గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వంతెన వద్ద రోడ్డు స్వల్పంగా కుంగిపోడంతో కారును బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. రాకేశ్ రెడ్డి, స్వామిలకు స్వల్ప గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి 108కు సమాచారం అందించడంతో గాయపడిన వారిని బోథ్‌లోని సివిల్ దవాఖానకు తరలించారు.

విద్యుత్ షాక్‌తో మేక మృతి

ఇచ్చోడ, జూన్ 7 : ఇచ్చోడ మండలం గేర్జం గ్రామంలో గద్దె భూమన్నకు చెందిన మేక శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడు వివరాల ప్రకారం.. ప్రతి రోజూ మాదిరిగానే మేక మేతకు వెళ్లింది. ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం తీగకు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.10 వేలు ఉంటుందని తెలిపారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, జూన్ 7 : లేబర్ కార్డు కలిగిన కార్మికులందరూ కార్మికుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు సౌమ్య అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీలో వడ్డెర సంఘ భవనంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును నిర్వహించారు. 30 మంది కార్మికులకు 55 రకాల రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంజీవ్, అనిల్ పాల్గొన్నారు.

హరితహారానికి సన్నద్ధం

- నైరుతి రుతుపవనాల రాకతో మొక్కలు నాటేందుకు మొదలైన పనులు
- ఈ ఏడాది 4.16 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

జామ్ నర్సరీలో పెరిగిన మొక్కలు

సారంగాపూర్, జూన్ 7: నైరుతి రుతుపవనాలు మండలానికి తాకడంతో మొక్కలు నాటేందుకు మండల అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. పదో విడుత హరితహారానికి అధిక లక్ష్యాన్ని నిర్దేశించుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తును ప్రారంభించింది. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధి హామీ కూలీలతో తవ్వించాలని ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో క్షేత్రస్థాయిలో అనువైన స్థలాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది సారంగాపూర్ మండల వ్యాప్తంగా 4.16 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉంది. అయితే 32 గ్రామపంచాయతీల్లో 32 నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రతి జీపీ పరిధిలో 5వేల చొప్పున మొక్కలు నాటాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు. గ్రామాల్లో ఎఫ్ఏలు కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. కూలీలకు కొలతల ప్రకారం రోజుకు రూ.300 వరకు ఉపాధి పొందే అవకాశం ఉంది. ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా గుంతలను తవ్వి సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నర్సరీల్లో చాలా రకాల మొక్కలు...

పదో విడుత హరితహారం కోసం గ్రామీణాభివృద్ధి శాఖ నర్సరీల్లో చాలా రకాలైన మొక్కలు పెంచుతున్నారు. కానుగ, నిమ్మ, దానిమ్మ, మందారం, గులాబీ, సీతాఫలం చింత, టేకు, మొక్కలు పెంచుతున్నారు. తొలకరి వర్షాలు కురవడంతో గ్రామాల్లో గుంతలు తవ్వించాలని ఎఫ్ఏ, పంచాయతీ కార్యదర్శులకు సూచించామని ఏపీవో లక్ష్మారెడ్డి తెలిపారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

సమావేశంలో నివేదికలు వివరిస్తున్న అధికారులు

ఉట్నూర్, జూన్ 7: రైతులను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 5 కోట్ల రూపాయల ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్యం అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులను అభివృద్ధి పర్చేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా అధికారులు ప్రగతి నివేదికలు చదవి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఎంపీడీవో శాస్త్రీ, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నెలలు నిండని శిశువుకు ప్రాణం పోసిన డాక్టర్

భైంసా, జూన్, 7 : నెలలు నిండని శిశువుకు జీడీఆర్ దవాఖాన పిల్లల వైద్యులు అనిల్ కుమార్ కంగారు కేర్ చికిత్స ద్వారా 25 రోజుల పాటు చికిత్స చేసి సంరక్షించారు. వివరాలకు వెళ్లితే ..భైంసా మండలంలోని సిరాల గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే గర్భిణి 8 మాసాలకే పురిటినొప్పులు రావడంతో దవాఖానకు తీసుకవచ్చారు. దీంతో తొమ్మిది నెలలు నిండకుండానే ఆడ శిశువుకు జన్మనిచ్చింది. దీంతో బిడ్డను కాపాడాలని కుటుంబ సభ్యులు ప్రాదేయపడడంతో కంగారు జంతువు తన శిశువును ఎలా రక్షించుకుంటుందో అదే విధంగా చికిత్స చేసి బిడ్డను కాపాడారు. దీంతో డాక్టర్ అనిల్ కుమార్‌ను పలువురు అభినందించారు.

శిశువుతో డాక్టర్ అనిల్ కుమార్

విద్యార్థులకు అభినందన

విద్యార్థినిని అభినందిస్తున్న మోహన్ రావు పటేల్

భైంసా, జూన్ 7 : భైంసాలోని పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించిన వేదం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాల విద్యార్థులను ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముథోల్, జూన్, 7: వెంకటాపూర్ గ్రామానికి చెందిన మేస్త్రీ నరేందర్ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సుభాష్ జాదవ్, నాయకులు ఉన్నారు.

ఏరియా దవాఖానలో పేదలకు అందని వైద్యం

చేయి విరిగిన బాలుడితో తండ్రి సందీప్ పటేల్

కుభీర్, జూన్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు వైద్య సేవలు నామమాత్రమయ్యాయి. ఇందుకు నిదర్శనం కుభీర్ మండలం పార్డి(కే) గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ జాదవ్ సందీప్ పటేల్ కుమారుడు విజయ్(7) గురువారం గ్రామంలో ఆడుకుంటూ కింద పడి పోవడంతో చేయి విరిగింది. దీంతో కుభీర్‌లో ఆర్ఎంపీ వద్ద ఎక్స్‌రే తీయించుకొని ప్రథమ చికిత్స చేసుకొని టెంపరరీ బ్యాండేజీ వేసి భైంసాలోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు రెఫర్ చేశారు. శుక్రవారం బాలుడి తండ్రి పెద్దాసుపత్రికి ఉదయం 9 గంటలకు వెళ్లి ఓపీ రాయించుకున్నాడు. మధ్యాహ్నం 12గంటలైనా ఆర్థో డాక్టర్ డ్యూటీకి రాకపోగా అక్కడే ఉన్న సిబ్బందికి అడిగాడు. ప్రైవేట్ దవాఖానకు వెళ్లమని వారు సలహా ఇవ్వడంతో తన వద్ద రూ.500 ఉన్నాయని చేసేది ఏమిలేక వెనుదిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను వివరణ కోరగా జీడీఆర్ ప్రైవేట్ ధవాఖానకు వెళ్లండి నేను చెబుతాను ఫీజు తక్కువ తీసుకుంటాడని బదులిచ్చారు. అధికారుల తీరుతో పార్డి(కే) గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు పేదలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలు ఎత్తుకుంటారు..దించేస్తారు..

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్

భైంసా, జూన్ 7 : ప్రజలు ఎత్తుకుంటారని..అప్పుడే దించేస్తారని క్రుంగిపోవాల్సిన అవసరం ఏమి లేదని మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికలో ఓట్లు ఎక్కువ వచ్చాయని కొందరు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిరం కట్టిన బీజేపీ ఎంపీ గెలవకుండా సమాజ్‌వాది పార్టీ ఎంపీ అభ్యర్థి గెలిచారని ఎద్దేవా చేశారు. అంతేగాకుండా ప్రొసీడింగ్ కాపీలతో తాము పనులు చేసుకుంటూ ముందుకు పోతున్నామని, ఆ పనులను సైతం మేమే తెచ్చామంటూ కొందరు చెప్పుకుంటున్నారన్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 8 కోట్లు, వాటర్ సప్లయ్‌కి రూ. 2 కోట్లు, సిరాల ప్రాజెక్టుకు రూ. 13 కోట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలకు రూ. 2 కోట్లు, ఇతర వాటికి రూ. 3 కోట్లు మొత్తం రూ. 28 కోట్ల వరకు నిధులు తెచ్చామన్నారు. ఏదేమైనా ప్రజల కోసం పని చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు శంకర్ చంద్రే, ఓం ప్రకాశ్ లడ్డా, భోజరాం, రాంచందర్ రెడ్డి, ఎంఏ లతీఫ్, తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఇచ్చోడ, జూన్ 7 : పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ శాఖాధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవపట్నం, బాజీపేట్, గుండాల, సిరిచెల్మ గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారని తెలుసుకొని బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌తో కలిసి వ్యవసాయ భూములను పరిశీలించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూముల్లో కందకాలు తవ్వడాన్ని ఆపాలని అటవీ శాఖాధికారులకు సూచించారు. ఏ సమస్య ఉన్న గ్రామస్తుల సమక్షంలో కమిటీలతో మాట్లాడి పరిష్కరించాలి తప్ప జబిలం చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అటవీ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

పాత పాఠశాల భవనం సందర్శన



పాఠశాల భవనం వద్ద పూర్వ విద్యార్థులు

కుంటాల, జూన్, 7 : కుంటాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో మన ఊరు-మన బడి పథకం కింద నిర్మిస్తున్న కొత్త భవనం చివరి దశకు వచ్చింది. త్వరలో కూల్చివేయనున్న పాత పాఠశాల భవనాన్ని చూసేందుకు 1999-2000 బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. పాఠశాల ముందు ఫొటోలు దిగి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఉట్నూర్, జూన్ 7 : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శాంతినగర్, బోయవాడ, పాత ఉట్నూర్, ఏత్మాసూర్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

10 నుంచి ప్రజావాణి

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 7: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ నెల 10 నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నిర్మల్ అర్బన్, జూన్ 7: నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇంద్రవెల్లి, జూన్ 7: ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు విక్రయించిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సునీల్ వ్యాపారస్తులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలతోపాటు పాన్‌షాపుల్లో తనిఖీ చేశారు. కిశోర్ కిరాణ దుకాణంలో రూ. 47వేల విలువ గల నిషేధిత వివిధ రకాల గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. జన్నావార్ నితేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భీంరావ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

నార్నూర్, జూన్ 7 : వర్షాకాలంలో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. గుంజాల గ్రామ పంచాయతీ పరిధిలోని సోంజిగూడలో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి శుభ్రతపై అవగాహన కల్పించారు. కలుషిత నీటిని పారబోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఇక్కడ వైద్య సిబ్బంది హిమబిందు, ఈశ్వరి, విద్యరాణి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న సుంకెట పోశెట్టి

భైంసా, జూన్ 7: ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి అన్నారు. శుక్రవారం భైంసాలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్ అమలు చేసి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాజేశ్వర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఖానాపూర్, జూన్ 7 : ఖానాపూర్ పీఏసీఎస్‌లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవో భూమి ఆశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి తమ క్లస్టర్ ఏఈవోల వద్ద టోకెన్ తీసుకురావాలని సూచించారు. 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగు రూ.1116 ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్రూం అందించాలి

నిర్మల్ అర్బన్, జూన్ 7 : అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్రూం అందించాలని స్నేహ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన దివ్యాంగులు 20 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ జీవనం గడుపుతున్నామని, అధికారులు అర్హులకు అందించాల్సిన ఇండ్లను అనర్హులకు కేటాయించారన్నారు. పూర్తి విచారణ చేసి అర్హులైన దివ్యాంగులకు ఇండ్లను అందించాలన్నారు.

నీట్‌లో విద్యార్థిని ప్రతిభ

సుప్రియ

లోకేశ్వరం, జూన్ 7 : రాజురా గ్రామానికి చెందిన కచ్చకాయల సుప్రియ నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 518 మార్కులు సాధించింది. సుప్రియను మండల వాసులు అభినందించారు.

రైతులకు అవగాహన

సోన్, జూన్ 7 : సోన్ మండలం కూచన్‌పెల్లి గ్రామంలోని ఏఈవో అంబాజీ రైతులకు కొత్త వ్యవసాయ సాంకేతికతను అవలంబించడం గురించి అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీ, పీఎస్‌బీ, భూమిలో తెగుళ్లను ముందే అరికట్టేందుకు ట్రైకో డెర్మ విరిడి ఉపయోగాలు, పశువుల ఎరువులో కలిపి ఎలా వాడాలో రైతులకు డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సారంగాపూర్, జూన్ 7: కౌట్ల(బీ) గ్రామానికి చెందిన మైండ్ల చైత్ర అనే బాలికపై విద్యుత్ స్తంభం విరిగిపడి కాలు విరిగిన విషయం తెలిసిందే. నిజామాబాద్ దవాఖానలో బాలికకు ఆపరేషన్ చేయించారు. శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ ఫౌండేషన్ సభ్యులు మహేశ్, నర్సయ్య, చౌహాన్, ప్రకాశ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఖానాపూర్ రూరల్, జూన్ 7: ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పమాడలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడని ఎస్ఐ లింబాద్రి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పమాడకు చెందిన తొడసం శ్రీకాంత్ (23) నూతనంగా గృహ నిర్మాణాన్ని చేపట్టాడు. ఈ ఇంటి నిర్మాణానికి వాటర్ క్యూరింగ్ చేద్దామని వ్యవసాయం పొలంలో ఉన్న బావి నుంచి విద్యుత్ మోటర్‌ను అమర్చారు. అది పని చేయకపోవడంతో బావిలో దిగిన అతను ఈ మోటర్‌ను పరిశీలించే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. మృతిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తాంసి(తలమడుగు), జూన్ 7 : రైతులకు నకిలీ, లూజ్, గుర్తింపు పొందని పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదని మండల వ్యవసాయ అధికారి మహేందర్ అన్నారు. శుక్రవారం తలమడుగుతో పాటు భరంపూర్ గ్రామంలో రైతులకు విత్తనాల సేకరణపై అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా అధికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

ఇచ్చోడ, జూన్ 7 : దుబార్‌పేట్ గ్రామంలో వ్యవసాయ విస్తరణాధికారి అనుదీప్ రెడ్డి రైతులకు విత్తనాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద విత్తనాలు కొనాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఒకే రకం విత్తనాలు కాకుండా రెండు, మూడు రకాల విత్తనాలు విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

ఉట్నూర్ రూరల్, జూన్ 7: విత్తనాలు కొనేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో దేవేందర్ అన్నారు. కొప్పర్‌ఘడ్ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా శ్యాంపూర్ గ్రామంలో ఏఈవో రవీందర్ రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 7 : సిరికొండకు చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశీ రాజేశ్వర్(32) ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెల 2వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట ఇచ్చోడ బ్లాక్ అధ్యక్షుడు మైమూద్ ఖాన్, సిరికొండ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, పొన్న మాజీ ఎంపీటీసీ మాధవ్ పటేల్, షేక్ ఇమామ్, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా, మండల మైనార్టీ చైర్మన్ రంజాన్, మల్లేశ్, సంజీత్, లక్ష్మణ్ ఉన్నారు.

ఇంద్రవెల్లి, జూన్ 7: మండలంలోని డొంగర్‌గాం గ్రామానికి చెందిన భార్యాభర్తలు అనక సంతోష్, స్వప్న గురువారం పిడుగు పాటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. అనంతరం తనవంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, నాయకులు కాంబ్లే అతిశ్‌కుమార్, భాస్కర్, గోవింద్, వెంకటేశ్ ఉన్నారు.

విజయవంతంగా ధాన్యం కొనుగోలు

ఖానాపూర్ రూరల్, జూన్ 7: ఖానాపూర్ మండలం సుర్జాపూర్, బాదనకుర్తి గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు శుక్రవారంతో విజయవంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.. కొనుగోలు కేంద్రాలను మార్కెటింగ్ డీపీఎం రాజేశ్వర్, సెంటర్ ఇన్‌చార్జి బీకేసింగ్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో చివరి రోజు పనులను వేగవంతం చేసి ఉన్న ధాన్యాన్ని మొత్తంను కొనుగోలు చేసి ముగించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.